సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
గురువారం, 04.06.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 213
పేజీలు: 06 వెల: రూ. 5

## సౌతాఫ్రికాతో తెలంగాణ భాగస్వామ్యం

- విద్య, నైపుణ్యాభివృద్ధి, వైద్యం, పెట్టుబడుల రంగాల్లో భాగస్వామ్యానికి ముందడుగు
- హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్, హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం
- తెలంగాణ రైజింగ్ సమ్మిట్-2026కు దక్షిణాఫ్రికా ప్రతినిధులకు ఆహ్వానం
- పెట్టుబడులు, పరిశ్రమల రంగాల్లో సహకార విస్తరణకు చర్చలు
- భారత్ ఫ్యూచర్ సిటీతో తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు
- రేవంత్-మషాటిలే భేటీతో కొత్త ఊపు

02



## సచివాలయంలో కూర్చోనివ్వం

### పవన్ కళ్యాణ్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వార్నింగ్

- సోదరుడిగా ఇంటికి వస్తే హైదరాబాద్ బిర్యానీ తినిపిస్తా
- ప్రాంతీయవాదాన్ని ఉగ్రవాదంతో పోలుస్తారా?
- దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదను

02




## అమెరికాకు రూ.95 లక్షల టికెట్!

### హెచ్-1బీ ఫాస్ట్ ట్రాక్ ఫీజు లక్ష డాలర్లకు పెరిగినా తగ్గని దరఖాస్తుల జోరు

- 15 రోజుల్లో వీసా ప్రాసెసింగ్ కోసం భారీ మొత్తం చెల్లిస్తున్న అభ్యర్థులు
- ఈ ఏడాది ఇప్పటికే 2.86 లక్షల అప్లికేషన్లు.. 2 లక్షల మందికి పైగా ప్రీమియం ఎంపిక
- పెరిగిన ఖర్చులతో ఉద్యోగ ఆఫర్లు వెనక్కి తీసుకుంటున్న అమెరికా కంపెనీలు
- అమెరికా డ్రీమ్ ఖరీదైనా.. భారత ఐటీ ఉద్యోగుల ఆశలు మాత్రం చెక్కుచెదరలేదు

02





## కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే

### మంత్రులుగా 13 మంది ప్రమాణం

- కర్ణాటక పగ్గాలు చేపట్టిన డీకే శివకుమార్
- 25వ సీఎంగా శివకుమార్ ప్రమాణం
- సిద్ధరామయ్య తర్వాత డీకేకు అవకాశం
- డీకే కేబినెట్‌కు శ్రీకారం

02



## పవన్‌ను అడ్డుకోవడం అప్రజాస్వామికం

### తెలంగాణ రాజకీయాలపై చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు




- దేశంలో ఉన్నప్పుడు ఎక్కడైనా ప్రచారం చేసే హక్కు ఉంది
- డీకే శివకుమార్ కూడా ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేశారు
- ప్రాంతీయ విద్వేషాలపై రాజకీయాలు చేయొద్దని హితవు
- 12 ఏళ్ల తర్వాత కూడా పాత సెంటిమెంట్లు ఎందుకు?

02


## నకిలీ ఐఏఎస్ ముఠా అరెస్ట్

### ఓ కానిస్టేబుల్, ఆరుగురితో ఏర్పడిన ముఠా



- ఐఏఎస్ అధికారులమంటూ వ్యాపారిని బెదిరించిన నిందితులు
- ఫేక్ పోలీస్ కారులో సూర్యాపేటకు తీసుకెళ్లి నగదు వసూలు
- ప్రధాన నిందితుడు నాగరాజ్ సహా నలుగురు అరెస్ట్
- రెండు గన్స్, ల్యాప్‌టాప్‌లు, రబ్బర్ స్టాంపులు స్వాధీనం
- మరికొందరి కోసం గాలింపు కొనసాగింపు

02



## కేటీఆర్ పాదయాత్ర..

### 2028 ఎన్నికల లక్ష్యంగా జనంలోకి

### సంచలన ప్రకటన చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

- తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణలు
- వచ్చే ఏడాది జనంలోకి వెళ్తామని ప్రకటన
- కాంగ్రెస్‌పై దూకుడు పెంచనున్న బీఆర్ఎస్
- కేడర్‌లో కొత్త జోష్ నింపే వ్యూహం
- తెలంగాణ ఆత్మగౌరవమే ప్రధాన అస్త్రం
- 2028 ఎన్నికలకు శంఖారావంగా పాదయాత్ర!

**ముద్ర డెస్క్ :**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన పాదయాత్ర ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో పెను చర్చకు దారితీసింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఆయన, వచ్చే ఏడాది నుంచి ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తానని ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రతిపక్ష పాత్రలో ఉన్న బీఆర్ఎస్‌కు ఈ పాదయాత్ర కొత్త దిశను నిర్దేశించనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం నెలకొంది. పలువురు నేతలు పార్టీని వీడగా, మరికొందరు భవిష్యత్తుపై సందిగ్ధంలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీ శ్రేణుల్లో మళ్లీ ఉత్సాహం నింపేందుకు, కేడర్‌ను ఏకం చేసేందుకు కేటీఆర్ పాదయాత్ర కీలకంగా మారనుంది. నాయకత్వం నేరుగా ప్రజల్లోకి వస్తోందనే సంకేతం కార్యకర్తలకు కొత్త భరోసా ఇవ్వనుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని రాజకీయంగా ఉపయోగించుకోవడమే కేటీఆర్ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. రైతు రుణమాఫీ, ఆరు గ్యారంటీల అమలు, నిరుద్యోగ సమస్యలు, సాగునీరు, విద్యుత్ సరఫరా వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ఎండగడుతూ ప్రజాభిప్రాయాన్ని తమ వైపు తిప్పుకునేందుకు పాదయాత్రను వేదికగా మార్చుకోవాలని పార్టీ యోచిస్తోంది.

ఇప్పటివరకు ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి అంశాల్లో తనదైన ముద్ర వేసిన కేటీఆర్‌కు 'అర్బన్ లీడర్' అనే గుర్తింపు ఉంది. అయితే పాదయాత్ర ద్వారా గ్రామీణ తెలంగాణలో విస్తృతంగా పర్యటించే అవకాశం లభించనుంది. రైతులు, మహిళలు, యువత, వివిధ వర్గాల ప్రజలతో నేరుగా మమేకం కావడం ద్వారా తన రాజకీయ పరిధిని మరింత విస్తరించుకునే అవకాశముంది. ఇదే సమయంలో కేసీఆర్ తర్వాత పార్టీకి ప్రధాన నాయకత్వం తానేనని ప్రజల్లో బలమైన మిగతా 02లో



## తెలంగాణ గడ్డ మా జాగీరు

### పవన్ వ్యాఖ్యలకు గద్దర్ కుమార్తె వెన్నెల కౌంటర్

- తెలంగాణ ఉద్యమాలతో వచ్చింది.. రాజకీయ పొత్తులతో కాదు
- తెలంగాణ ప్రజలకే పాలనా హక్కు ఉంటుంది

02

## కోర్ భూములకు రెక్కలు

### ఎక్స్‌ప్రెస్‌వే భూసేకరణకు ఎకరాకు రూ.1.24 కోట్ల పరిహారం

- రాయదుర్గం వేలంతో పెరిగిన భూముల విలువ
- రైతులకు రికార్డు చెల్లింపులు
- రూ.4600 కోట్ల గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుకు వేగం
- ఫ్యూచర్ సిటీ కనెక్టివిటీకి భారీ ఊతం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో, ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇటీవల రాయ దుర్గం ఏరియాలో ప్రభుత్వం నిర్వహించిన వేలంలో ఎకరాకు రికార్డు స్థాయిలో రూ.204 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్ర తిష్టాత్మకంగా చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు రైతుల నుంచి భూములను సేకరించడం సవాలైంది. మిగతా 02లో

## 21 మంది సజీవ దహనం

### ఢిల్లీ రెస్టారెంట్లో భారీ అగ్ని ప్రమాదం

- 40 మంది వరకు గాయాలు
- 37 మందిని రక్షించిన ఫైర్ సిబ్బంది
- మరణించిన వారిలో అత్యధికులు విదేశీయులే
- ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు సానుభూతి, నష్టపరిహారం ప్రకటన

06

*దేశరాజధాని ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. మాలవీయ నగర్ లోని ఓ రెస్టారెంట్ లో బుధవారం ఈ ప్రమాదం సంభవించింది. ఇప్పటికే 21 మంది వరకు మరణించగా... 40 మంది గాయపడ్డారు. వారిని వైద్య చికిత్స కోసం సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. రెస్టారెంట్ భవనంలో మరో 30 వరకు చిక్కుకొని ఉన్నట్లు సమాచారం.*

**ముద్ర డెస్క్ :**






## మమతా బెనర్జీకి షాక్

### ప్రతిపక్ష నేతగా టీఎంసీ రెబల్



*తృణమూల్ కాంగ్రెస్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా తనను స్పీకర్ నియమించారని టీఎంసీ రెబల్ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ ప్రకటించారు. తమ తిరుగుబాటు శిబిరాన్ని పార్టీ శాసనసభా పక్షంగా గుర్తించాలని చేసిన అభ్యర్థనను స్పీకర్ అంగీకరించారని చెప్పారు. స్పీకర్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన రితబ్రత.. తమ ముఖ్య సలహాదారుగా వ్యవహరించాలని మమతా బెనర్జీని కోరడం గమనార్హం.*


## శాస్త్రీయంగా, హేతుబద్ధంగా భూముల మార్కెట్ విలువల సవరణ

- క్షేత్రస్థాయి అధ్యయనం ఆధారంగా కొత్త విలువల నిర్ణయం
- ఈ నెల 5వ తేదీ నుంచి అమలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

06



## ఇదీ AI ముద్ర



## ఆరోగ్యానికి రోజుకు గంట శారీరక శ్రమ




పిల్లలు శారీరకంగా దృఢంగా ఉండటానికి రోజుకు కనీసం ఒక గంట సేపు వ్యాయామం లేదా ఆటల్లో పాల్గొనేలా చూడాలి. ఇది వారి భావి జీవితంపై సానుకూల ప్రభావాన్ని చూపడమే కాకుండా ఆరోగ్యం దెబ్బతినకుండా కాపాడుతుంది.

# 'కోర్' భూములకు రెక్కలు

(మొదటి పేజీ తరువాయి)
దీంతో భూసేకరణ ప్రక్రియ సజావుగా.. ఎలాంటి వివాదాలు లేకుండా సాగడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు లకు రికార్డు స్థాయి పరిహారం చెల్లించాల్సి వస్తోంది. తాజాగా ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆ ర్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన కొందరు రై తులకు ప్రభుత్వం రికార్డు స్థాయిలో పరిహా రం అందించింది. ఎకరాకు రూ.1.24 కోట్ల చొప్పున భారీ పరిహారాన్ని అందజేసింది.

**ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం 15 ఎకరాల భూసేకరణ**



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు ఆనుకుని, ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న కొంగర కలాన్, కొంగర ఖుర్ద్ గ్రామాల్లో ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పలుకుతోంది. ఈ ప్రాంతంలో ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం 15 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. మార్కెట్ రేట్లు భారీగా ఉండటంతో జిల్లా యంత్రాంగం రైతులతో పలుమార్లు చర్చలు జరిపింది. చివరకు కుదిరిన ఒప్పందం ప్రకా రం ఎకరాకు రూ.1.24 కోట్ల రికార్డు స్థాయి పరిహారాన్ని చెల్లించి భూములను స్వాధీనం చేసుకున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఎక్స్‌ప్రెస్‌వే వెళ్లే మార్గం లోని ఇతర లొకేషన్లను బట్టి రైతులకు ఎకరా కు రూ.30 లక్షల నుంచి రూ.98 లక్షల వరకు అందజేశారు. మారుమూల ప్రాంతాల్లో మాత్రం ఎకరాకు రూ.15 లక్షల చొప్పున చెల్లిస్తున్నారు. మరోవైపు.. రావిర్యాల్ ఓఆర్ఆర్ నుంచి మీర్ఖాన్పేట్ మీదుగా ఆమన్‌గల్ వరకు రెండు విడతల్లో దాదాపు రూ.4600 కోట్ల అంచనా వ్యయంతో 300 అడుగుల వెడల్పైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 1500 ఎకరాల భూమి అవసరం కానుంది. ఫేజ్-1 కింద 447 ఎకరాల భూసేకరణ ఇప్పటికే పూర్తయింది. ఫేజ్-2 కింద మరో 558 ఎకరాల భూసేకరణ ప్రక్రియ ప్రస్తుతం వేగంగా సాగుతోంది. ఈ భారీ ఎక్స్‌ప్రెస్‌వే రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూర్, కడ్తాల్, ఆమన్‌గల్ మండలాల గుండా వెళ్తుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన మొత్తం 1500 ఎకరాల భూమిలో దాదాపు 300 ఎకరాలు అటవీ భూమి కాగా.. మరో 200 ఎకరాలు తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే ఫ్యూచర్ సిటీకి రవాణా కనెక్టివిటీ మరింత అద్భుతంగా మారనుంది.

# కేటీఆర్ పాదయాత్ర..

(మొదటి పేజీ తరువాయి)
సందేశం పంపేందుకు కూడా ఈ యాత్ర ఉపయోగపడనుంది.
మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించిన తీరు రాజకీయంగా కొత్త చర్చకు తెరలేపింది. తెలంగాణ



రాజకీయాల్లో బయటి జోక్యాన్ని వ్యతిరేకిస్తూ, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రస్తావించడం ద్వారా ప్రాంతీయ సెంటిమెంట్‌ను మళ్లీ రాజకీయ అజెండాగా మార్చే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ అంశాన్ని బీఆర్ఎస్ భవిష్యత్తులో మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.
కేటీఆర్ పాదయాత్ర ప్రారంభమైతే రాష్ట్ర రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య పోరు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉంది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా, మరోవైపు బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై దూకుడుగా ముందుకెళ్లనుంది. దీంతో వచ్చే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి.
రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, కేటీఆర్ పాదయాత్ర కేవలం ప్రజా పర్యటన మాత్రమే కాదు. ఇది బీఆర్ఎస్ పునరుద్ధరణకు, కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుకు, 2028 అసెంబ్లీ ఎన్నికల వ్యూహానికి కీలకమైన కార్యక్రమంగా మారనుంది. ఈ యాత్ర విజయవంతమైతే తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

## కర్ణాటక ముఖ్యమంత్రిగా

# డీకే శివకుమార్!

**ముద్ర డెస్క్ :**
కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణం చేశారు. ఆయనతోపాటు 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. సిద్ధరామయ్య రాజీనామాతో డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు.
కర్ణాటక రాష్ట్రానికి 25వ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డీకే శివకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తన చేతిలో భారత రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రమాణ స్వీకారం చేయడం చాలా ప్రత్యేకంగా నిలిచింది. బుధవారం సాయంత్రం సరిగ్గా 4.10 గంటలకు బెంగళూరులోని లోక్‌భవన్‌లో ఉన్న ప్రతిష్టాత్మకమైన గ్లాస్ హౌస్ ప్రమాణ స్వీకారానికి వేదికైంది. కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, డీకే శివకుమార్ చేత పదవీ ప్రమాణం చేయించారు. 71 ఏళ్ల శివకుమార్, తన చిరకాల కోరిక అయిన ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. శివకుమార్‌తో పాటు ఎక్స్‌పీరియన్స్ ఉన్న జీ పరమేశ్వరన్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరిద్దరితోపాటు ఎమ్మెల్యేలు, మంత్రులు



గా బాధ్యతలు స్వీకరించారు. ఈ జాబితాలో సామాజిక సమీకరణాలు వారసత్వ ప్రాధాన్యతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.
సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర కూడా మంత్రిగా ప్రమాణం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే కూడా ప్రమాణం చేసిన వారిలో ఉన్నారు. వీరితోపాటు కేహెచ్ మునిపయ్య, కేజే జార్జ్, రామలింగారెడ్డి, ఎంపీ పాటిల్ వంటి సీనియర్ నేతలంతా శివకుమార్ కేబినెట్‌లో ఉన్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి జాతీయ స్థాయి నేతలు తరలివచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర సీనియర్ నేతలు వచ్చి శివకుమార్‌కు శుభాకాంక్షలు చెప్పారు. పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్న సిద్ధరామయ్య కూడా ప్రమాణ స్వీకారానికి వచ్చి శివకుమార్‌ను ఆలింగనం చేసుకొని అభినందించారు.

## పవన్ కల్యాణ్ ను ఇక్కడి సచివాలయంలో

# కూర్చోనివ్వం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో స్పందించారు. తెలంగాణ భూమి పుత్రుల జాగీరేనని స్పష్టం చేసిన ఆయన, పవన్‌ను సోదరుడిగా గౌరవిస్తామని, ఇంటికి వస్తే హైదరాబాద్ బిర్యానీ పెడతామని అన్నారు. అయితే తెలంగాణ సచివాలయంలో కూర్చుంటామని అనుకుంటే మాత్రం అంగీకరించబోమని వ్యాఖ్యానించారు.సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, ప్రాంతీయవాదాన్ని ఉగ్రవాదంతో పోల్చడం సరికాదన్నారు. పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన పోరాటం కూడా ప్రాంతీయవాదమేనా అని ప్రశ్నించారు.



తెలంగాణపై వ్యాఖ్యలు చేసే ముందు చరిత్రను తెలుసుకోవాలని పవన్‌కు సూచించారు.తెలంగాణలో ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయవచ్చని, కానీ ఇక్కడి ప్రజల భావోద్వేగాలను గౌరవించాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు.అలాగే తెలంగాణ ఏర్పాటుకు కాంగ్రెస్ ఎన్నో అడ్డంకులు సృష్టించిందని ఆరోపించిన కేటీఆర్, తెలంగాణ కథలో కాంగ్రెస్ ప్రధాన విలన్ అని విమర్శించారు. కేసీఆర్ పోరాటం, దీక్ష వల్లే తెలంగాణ సాధ్యమైందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు పెంచడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు.



# తెలంగాణలో సౌతాఫ్రికా పెట్టుబడులు

**ముద్ర, హైదరాబాద్ :**
హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడులు, విద్య, వైద్య సేవలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అంతర్జాతీయ భాగస్వామ్యాలను మరింత విస్తరిస్తోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు.
సమావేశంలో విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడుల రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరు పక్షాలు నిర్ణయించాయి. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ఐటీ, ఫార్మా, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో ప్రపంచ స్థాయి నైపుణ్య మానవ వనరులను తయారు చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఫార్చ్యూన్-500 కంపెనీలు తమ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం రాష్ట్ర సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.
వైద్య రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతిని ప్రస్తావించిన ముఖ్యమంత్రి, అత్యాధునిక ఆసుపత్రులు, నిపుణులైన వైద్యులు, తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్న నాణ్యమైన వైద్య సేవల కారణంగా విదేశాల నుంచి కూడా రోగులు హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. మెడికల్ టూరిజం రంగంలో దక్షిణాఫ్రికాతో కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించవచ్చని సూచించారు.
ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ప్రతినిధులను సీఎం ఆహ్వానించగా, పెద్ద ఎత్తున ప్రతినిధి బృందంతో హాజరవుతామని పాల్ మషాటిలే హామీ ఇచ్చారు. అలాగే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 30 వేల ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు విశేషాలను కూడా వివరించారు.
దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే మాట్లాడుతూ, భారత్‌తో తమ దేశానికి చారిత్రక బంధం ఉందని పేర్కొన్నారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా భారత కంపెనీలకు ఆఫ్రికా మార్కెట్లలో విస్తరణకు దక్షిణాఫ్రికా కీలక వేదికగా నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని, భవిష్యత్తులో మరింత సహకారానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.
ఈ సమావేశం తెలంగాణ-దక్షిణాఫ్రికా మధ్య విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు, పెట్టుబడుల రంగాల్లో కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేయనుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# పవన్‌ను అడ్డుకోవడం అప్రజాస్వామికం

**ముద్ర, హైదరాబాద్ :**
హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో పవన్ కల్యాణ్ కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. ఏ రాజకీయ నాయకుడికైనా దేశంలో ఎక్కడైనా పర్యటించే, ప్రజలను కలిసే హక్కు ఉందని పేర్కొన్నారు.
పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం, సభలకు ఆంక్షలు విధించడం వెనుక రాజకీయ ఉద్దేశాలున్నాయని చంద్రబాబు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు తమ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సభలు నిర్వహించడం సహజమని, వాటిని అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించారు.
ఈ సందర్భంగా ఫెడరల్ స్ఫూర్తిని గుర్తుచేసిన చంద్రబాబు, గతంలో తాను తమిళనాడులో ఎన్నికల ప్రచారం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. అలాగే కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కూడా ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేశారని గుర్తుచేశారు. "ఒకే దేశంలో ఉన్నప్పుడు ఒక రాష్ట్ర నేత మరో రాష్ట్రానికి వెళ్లకూడదనే నిబంధన ఎక్కడ ఉంది?" అని ప్రశ్నించారు. రాజకీయ పార్టీలు అభివృద్ధి, ప్రజాసేవల విషయంలో పోటీ పడాలని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం సరికాదని చంద్రబాబు హితవు పలికారు. తెలంగాణ ఏర్పడి 12 సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా పాత ఆంధ్రా-తెలంగాణ భావోద్వేగాలను రగిల్చే ప్రయత్నాలు చేయడం అనవసరమన్నారు.
తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, ఎవరు ఏ రాజకీయాలు చేస్తున్నారో వారికి బాగా తెలుసని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ వంటి నేతలను టార్గెట్ చేస్తూ ఇరుకైన రాజకీయాలు చేయడం ఎవరికీ మంచిది కాదని స్పష్టం చేశారు.

# తెలంగాణ గడ్డ మా జాగీరు

**ముద్ర, హైదరాబాద్:**
జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలకు ఆయన కుమార్తె వెన్నెల స్పందించారు. తెలంగాణ రాష్ట్రం రాజకీయ పార్టీల వల్ల కాదని, ప్రజల ఉద్యమాలు, త్యాగాల ఫలితంగానే ఏర్పడిందని ఆమె పేర్కొన్నారు. 'తెలంగాణ గడ్డ నిన్న మా అయ్యల జాగీరు, ఈరోజు మా జాగీరు, రేపు మా బిడ్డల జాగీరు' అంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలకే ఈ రాష్ట్రంపై హక్కు ఉందని, తెలంగాణను తెలంగాణ ప్రజలే పాలించాలని అన్నారు. గద్దర్ గురించి పవన్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో వెన్నెల స్పందించడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.



# పోలీసుల అదుపులో నకిలీ ఐఏఎస్ ముఠా

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ఐఏఎస్ పేరుతో చెలామణి అవుతోన్న ముఠాను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ కానిస్టేబుల్ ద్వారా ఆరుగురితో ఏర్పడిన టీంతో ఏర్పడిన ముఠా.. ఐఏఎస్ అధికారులమంటూ పూర్ణచంద్ర రావు అనే వ్యక్తిని ఈ ముఠా బెదిరించింది. ఫేక్ పోలీస్ కార్‌లో పూర్ణచంద్రరావును సూర్యాపేటకు తీసుకెళ్లి దాదాపు రూ. 6.26 లక్షల నగదును వసూలు చేసింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎట్టకేలకు బుధవారం నిందితులను పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు నాగరాజ్‌తో పాటు మరో ముగ్గురు అరెస్ట్ అయ్యారు. మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధాన నిందితుడు నాగరాజుపై రెండు పీడీయాక్ట్‌లు, 12 కేసులు ఉన్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి రెండు గన్స్, ల్యాప్‌టాప్‌లు, రబ్బర్ స్టాంపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.




## 'పెద్ది' హంగామా..

# రామ్ చరణ్‌కు గుడి కట్టేసిన ఫ్యాన్స్

**ముద్ర డెస్క్ :**
'పెద్ది' సినిమా కోసం రామ్ చరణ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూడడంలో ఓ విశేషముంది. 'ట్రిపుల్ ఆర్' గ్రాండ్ సక్సెస్ తో గ్లోబల్ స్టార్ గా జేజేలు అందుకున్నారు రామ్ చరణ్. ఆ మూవీతో ఆయనకు దేశవిదేశాల్లో ఎంతో మంది ఫ్యాన్స్ లభించారు. ముఖ్యంగా జపాన్ లో 'ట్రిపుల్ ఆర్' తరువాత ఆ సినిమా హీరోలిద్దరికీ అక్కడ విశేషాదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలోనే రామ్ చరణ్ 'పెద్ది' జూన్ 4వ తేదీన రిలీజ్ అవుతోందని తెలిసి, కొందరు జపాన్ లేడీ ఫ్యాన్స్ మన దేశానికి వచ్చారు. వారు 'పెద్ది'సినిమాను హైదరాబాద్ లోనే చూసి, ఎంజాయ్ చేయాలని ఆశిస్తున్నారట.
ఈ మూవీ ఘనవిజయం సాధిస్తే రామ్ చరణ్ కు చాలా రోజుల తరువాత ఓ బిగ్ హిట్ దక్కినట్టవుతుంది. అలాగే ఈ చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సానాకు 'ద్వితీయ విఘ్నం' తొలగిపోతుంది. బుచ్చిబాబు తన తొలి సినిమా 'ఉప్పెన'తో బంపర్ హిట్ సాధించారు. ఈ మూవీతోనూ ఓ బిగ్ హిట్ పట్టేస్తే పలువురు స్టార్స్ బుచ్చిబాబు వెంట పడే అవకాశం ఉందని ట్రేడ్ సర్కిల్స్ భావిస్తున్నాయి. ఇక ఈ చిత్రాన్ని నిర్మిస్తోన్న 'వృద్ధి సినిమాస్' అధినేత వెంకట సతీశ్ కిలారుకు నిర్మాతగా ఇదే మొదటి సినిమా.ఈ మూవీ గ్రాండ్ సక్సెస్ సాధిస్తే తొలి ప్రయత్నంలోనే వెంకట సతీశ్ బిగ్ హిట్ ను పట్టేసినట్టవుతుంది. అలా 'పెద్ది' గ్రాండ్ సక్సెస్ హీరో రామ్ చరణ్ కు, డైరెక్టర్ బుచ్చిబాబుకు, నిర్మాత వెంకట సతీశ్ కిలారుకు ఎంతో కీలకంగా మారింది.
మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానుల ఉత్సాహం పరుగులు తీస్తోంది. తమ హీరోకు 'పెద్ది' సినిమాతో బంపర్ హిట్ రావాలని చెర్రీ ఫ్యాన్స్ పూజలు చేస్తున్నారు. మరికొందరు 'పెద్ది'లో పహిల్వాన్ లా ఉన్న రామ్ చరణ్ విగ్రహాన్నే ప్రతిష్ఠించేసి పూజలు నిర్వహిస్తున్నారు. ఈ వేవ్ చూస్తోంటే 'పెద్ది' భారీ ఓపెనింగ్స్ సాధించేలా కనిపిస్తోంది. హైదరాబాద్ కుకట్ పల్లిలోని అర్జున్ థియేటర్ వద్ద 'పెద్ది'లోని రామ్ చరణ్ విగ్రహాన్ని నెలకొల్పి పూజలు చేశారు ఫ్యాన్స్. దాని చుట్టూ ఓ గుడి సెట్ వేసి 'కొణిదెల వారి ఆలయం', 'రామ్ చరణ్ ఆలయం' అంటూ అభిమానులు ఆ విగ్రహాన్ని ఆరాధిస్తుండడం విశేషం. ఈ బొమ్మ ఫ్యాన్స్ తో పాటు సాధారణ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 'ట్రిపుల్ ఆర్' తరువాత సరైన సక్సెస్ చూడని రామ్ చరణ్ కు 'పెద్ది' బంపర్ హిట్ ను అందిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.




## అమెరికా కలకు


# రూ.95 లక్షల టికెట్!

**ముద్ర డెస్క్ :**
అమెరికాలో ఉద్యోగం చేయాలనే కలతో H-1B వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. ఫాస్ట్ ట్రాక్ ప్రాసెసింగ్ ఫీజును లక్ష డాలర్లకు (సుమారు రూ.95.6 లక్షలు) పెంచినా దరఖాస్తులు భారీగా వస్తున్నాయి. అమెరికా హోమ్‌లాండ్ సెక్యూరిటీ సెక్రటరీ మార్క్‌వేన్ ముల్లిన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 2.86 లక్షల H-1B దరఖాస్తులు నమోదయ్యాయి. వీరిలో 2 లక్షల మందికిపైగా ప్రీమియం ప్రాసెసింగ్‌ను ఎంచుకుని భారీ ఫీజు చెల్లించారు.
ప్రీమియం ప్రాసెసింగ్ ద్వారా వీసా దరఖాస్తుల పరిశీలన 15 రోజుల్లో పూర్తవుతుండగా, సాధారణ దరఖాస్తులకు ఏడు నెలలకు పైగా సమయం పడుతోంది. అయితే ఈ భారీ ఖర్చులు అమెరికా కంపెనీలపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా విదేశీ నైపుణ్యం కలిగిన ఉద్యోగులపై ఆధారపడే మధ్యస్థాయి సంస్థలు, స్టాఫింగ్ కంపెనీలు ఖర్చుల భారం కారణంగా ఉద్యోగ ఆఫర్లను వెనక్కి తీసుకోవడం, జాయినింగ్ తేదీలను వాయిదా వేయడం లేదా అంతర్జాతీయ నియామకాలను తగ్గించడం జరుగుతోందని సమాచారం. ఈ పరిస్థితి అమెరికాలో ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తున్న భారతీయ ఐటీ నిపుణులు, విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో విదేశీ డాక్టర్లు, ఉపాధ్యాయులపై ఆధారపడే ఆస్పత్రులు, విద్యాసంస్థలకు కూడా ఈ పెరిగిన వీసా ఖర్చులు ఇబ్బందిగా మారవచ్చని అమెరికా సెనేటర్లు అభిప్రాయపడుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 04.06.2026
www.mudranews.in | @mudranews



**పిల్లల ఆరోగ్యానికి ..**
స్క్రీన్ సమయాన్ని తగ్గించడం. మొబైల్‌ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్‌ల ముందు గంటల తరబడి బద్ధకంగా కూర్చోకుండా పిల్లలను నియంత్రించాలి. ఒకే చోట ఎక్కువ సేపు కూలబడకుండా చూసుకోవడం ద్వారా అధిక బరువు, ఊబకాయం వంటి సమస్యలను నివారించవచ్చు.




## తాండూర్ మున్సిపల్ కమిషనర్ గా రాకేష్ రెడ్డి



**ముద్ర, తాండూరు ప్రతినిధి:** వికారాబాద్ జిల్లాతాండూర్ మున్సిపల్ కమిషనర్ గా పి రాకేష్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. బుధవారం కమిషనర్ ఛాంబర్ లోచార్జి తీసుకున్న అనంతరం పి. రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు సహకారంతో పార్టీలకతీతంగా పట్టణ అభివృద్ధి చేపడతారని తెలిపారు. మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగులు, వార్డ్ ఆఫీసర్లు సిబ్బంది, నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన రాకేష్ రెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు.

## నిషేధిత జాబితా నుంచి తొలగించాలి



**ముద్ర, కాప్రా:** కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శివ సాయి నగర్, ఇందిరా నగర్, సాయి నగర్, మీనాక్షి నగర్, మారుతి కాలనీ, టీచర్స్ కాలనీ, చర్లపల్లి బి.యన్.రెడ్డి నగర్ లకు చెందిన పలు సర్వే నెంబర్లను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలని, యు ఎల్ సి నుంచి పరిష్కారం చూపాలని కోరుతూ బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరినికలుసుకొని విజ్ఞాపన పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, పార్టీ నాయకులు నేమూరీ మహేష్‌గౌడ్ , కాలనీ కమిటీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, నాయకులు జౌండ్ల ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**ముద్ర, మల్కాజిగిరి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 90వ రోజు పూర్తి చేసుకున్న సందర్భంగా, అలాగే రాబోయే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజ్‌గిరి సర్కిల్ పరిధిలోని మౌలాలీ ఏపీఐఐసీ కాలనీలో ఉన్న పార్కులో బుధవారం మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ సందీప్, శానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస్, వెంకటేష్, రవీందర్, రాజు, యూబీడీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఏపీఐఐసీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో విత్తనాల చట్టం–1966 నిబంధనలను పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. యశ్వంత్ రావు సూచించారు. ముఖ్యంగా పత్తి విత్తనాలు కొనుగోలు చేసే రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని సాయిరాం ట్రేడర్స్, ఆనంద్ కిసాన్‌తో పాటు పలు విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు.

## అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ కన్నుమూత



**ముద్ర, కూకట్‌పల్లి:** అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ చిత్తారి అశోక్ కుమార్ గుండెపోటుతో మంగళవారం సాయంత్రం కన్నుమూశారు. మంగళవారం కొండాపూర్ వెళ్లిన ఆయనకు అక్కడ ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. వెంటనే ఆయనను మేడ్చల్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. జర్నలిస్ట్‌గా, అంబేద్కర్ ప్రజాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సమాజానికి ఎనలేని సేవలు అందించారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం కొనియాడారు. గురువారం ఉదయం 10 గంటలకు బోయిన్‌పల్లిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

## క్యాన్సర్ బాధితురాలికి రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరు



**ముద్ర, హైదరాబాద్:** నల్గొండ జిల్లా పానగల్ మండలానికి చెందిన క్యాన్సర్ బాధితురాలు సుంకర బోయిన లక్ష్మి కి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.5 లక్షల ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరైంది. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చికిత్స కోసం ఇప్పటికే కుటుంబ సభ్యులు భారీగా ఖర్చు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మి భర్త రాములు మంత్రి కోమటిరెడ్డిని కలిసి సహాయం కోరగా, ఆయన వెంటనే స్పందించి అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.

## ఆరోగ్యకర జీవనానికి సైక్లింగ్ తప్పనిసరి

**ముద్ర, హైదరాబాద్:** ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలి, ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించేందుకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో జూన్ 7న గచ్చిబౌలి స్టేడియంలో 'ఫిట్ ఇండియా–సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎల్‌బీ స్టేడియంలోని తన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. .ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గచ్చిబౌలి స్టేడియం నుంచి ప్రారంభమయ్యే సైక్లింగ్ ర్యాలీ స్టేడియానికి చేరుకుంటుంది. సుమారు 2 వేల మంది సైక్లిస్టులకు జ్ఞాపిక పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు అనిత,సుజాత,రవీందర్, రవితేజ, శ్రీనివాస్ అశోక్ ఇంజనీర్ శ్రీనివాస్ పాల్గొన్నారు

# పాలమూరు ప్రాజెక్టులకు కేసీఆర్ గ్రహణం

**రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు**




**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** ఉమ్మడి పాలమూరు జిల్లా లో నిర్మాణం లో ఉన్న ప్రాజెక్టు లకు కెసిఆర్ గ్రహణం పట్టిందని.... ఆయన హయాంలో ప్రాజెక్టు లను పడావు పడేసి జిల్లా కు తీరని అన్యాయం చేశారని మంత్రి జూపల్లి కృష్ణా రావు విమర్శించారు.కెసిఆర్ పడావు పెట్టిన ప్రాజెక్టు లకు జీవకళ తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన కు వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలు సహా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో పూర్తిచేసే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని మంత్రి అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న కెసిఆర్ ఒక్క ప్రాజెక్టును పూర్తిచేయలేదని విమర్శించారు.కేసీఆర్ ప్రాజెక్టు లు పూర్తిచేస్తానని హామీలు ఇచ్చి ఆర్భాటాలకు మాత్రమే పరిమితమయ్యారన్నారు.రూ.లక్ష కోట్ల వ్యయంతో పూర్తయ్యే పాలమూరు ప్రాజెక్టుకు కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి పూర్తి చేశామంటూ బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేసి 90 టీఎంసీల జలాలను జిల్లాకు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జూరాల, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, కల్వకుర్తి, అలంపూర్ తదితర ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ నెల 4న సీఎం రేవంత్‌రెడ్డి మక్తల్‌లో పర్యటించి జూరాల ప్రాజెక్టును సందర్శిస్తారని, 5న నార్లాపూర్, వట్టెం, కరివెన ప్రాంతాల్లో పర్యటించి ఉదండాపూర్‌లో బహిరంగ సభలో పాల్గొంటారని జూపల్లి పేర్కొన్నారు. ఈ సమావేశం లో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే, విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,నేతలు ఒబేదుల్ల కొత్వాల్, సురేందర్ రెడ్డి, నర్సింహా రెడ్డి,శిరాజ్ ఖాద్రి పాల్గొన్నారు.

# అటవీ సంపదను పెంచేందుకు ప్రభుత్వం కృషి

**వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**



**ముద్ర, వనపర్తి:** ప్రజలందరికీ మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించి, రాష్ట్రంలో 33 శాతం అటవీ సంపదను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఏకో పార్కులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణం పై అవగాహన కల్పిస్తూ సైక్లింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సైక్లింగ్ కార్యక్రమానికి వనపర్తి మున్సిపల్ చైర్పర్సన్ మాధవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్థానికులతో కలిసి ఎకో పార్కులో ఐదు కిలోమీటర్ల మేర సైక్లింగ్, వాకింగ్ కార్యక్రమంలో పాల్గొని సైకిల్ తొక్కి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరికీ మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించి, రాష్ట్రంలో 33 శాతం అటవీ సంపదను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మానవాళి మనుగడకు చెట్లే ప్రాణాధారమని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం అడవుల విస్తీర్ణాన్ని ఇంకా పెంచేందుకు చర్యలు చేపట్టబోతుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి అడవుల పెంపకం పై అవగాహన కల్పిస్తామని చెప్పారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్ సందర్శించి అటవీ శాఖ పరిధిలో చెక్ డాంలు, కుంటాలను పరిశీలన చేయడం జరిగింది అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా అదేవిధంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఎకో పార్కులో సైక్లింగ్ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. మొక్కలు నాటడం పై ప్రజలలో అవగాహన కల్పించి, జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే, కలెక్టర్ కు చిత్ర ప్రదర్శన ద్వారా అటవీశాఖ అధికారులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి శివ ఆశిష్, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, డిపిఆర్ఓ సీతారాం, డి వై ఎస్ ఓ సుధీర్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ ఆదర్శ్ సురభి



**ముద్ర, వనపర్తి:** వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో నకిలీ విత్తనాల సరఫరా విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నకిలీ విత్తనాలు సరఫరా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాలకు సంబంధించిన టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వానకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారని, కాబట్టి నకిలీ విత్తనాల విషయంలో టాస్క్ ఫోర్స్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఎక్కడైనా రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే అటువంటి వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఒకవేళ రైతులు వరి ధాన్యం వేయడానికి మాత్రమే మొగ్గు చూపినట్లయితే, కేవలం సన్న రకం వరి ధాన్యాన్ని మాత్రమే వేసేలా ప్రోత్సహించాలని సూచించారు. అలా కాకుండా దొడ్డు రకం వరి ధాన్యం వేయకుండా చూడాలని సూచించారు. మరోవైపు కొన్ని మండలాల్లో దాన్ 75(DAN 75) రకం వరి ధాన్యాన్ని రైతులు వేస్తున్నారని, ఈ రకం ధాన్యాన్ని వేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ రకం వరిని ఎవరు కొనుగోలు చేయడం లేదని కాబట్టి రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా వారికి దీనిపై అవగాహన కల్పించాలన్నారు. ఇక యూరియాకు సంబంధించి పక్కదారి పట్టకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. గత సీజన్లలో అత్యధిక మొత్తంలో యూరియా తీసుకున్న వారిని గుర్తించి వారు యూరియా దేనికోసం వినియోగిస్తున్నారు అనే అంశంపై తనిఖీ చేయాలన్నారు. వారు నిజంగా పంట కోసమే తీసుకుంటున్నారా లేదా పక్కదారి పట్టిస్తున్నారా అనే అంశంపై ఆరా తీయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్యప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయ అధికారులు, తహసిల్దార్లు, ఎస్సైలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో
# వట్టెం రిజర్వాయర్ వద్ద ఏర్పాట్ల పరిశీలన



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన వట్టెం వెంకటేశ్వర రిజర్వాయర్ పంప్ హౌస్‌ను ఈ నెల 5న సందర్శించనున్న నేపథ్యంలో బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని కుమ్మెర గ్రామ సమీపంలో ఉన్న వట్టెం వెంకటేశ్వర రిజర్వాయర్, పంప్‌హౌస్ ప్రాంతాలను ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. ముందుగా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఎల్లూరు రిజర్వాయర్, హెడ్ రెగ్యులేటర్, నార్లాపూర్ రిజర్వాయర్, డెలివరీ సిస్టర్న్స్, ఎంజీకేఎల్ఐ లిఫ్ట్–1 పంప్‌హౌస్ పనులను పరిశీలించనున్నారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్, హెడ్ రెగ్యులేటర్, ప్యాకేజ్–3 కాలువ పనులు, ఏదుల రిజర్వాయర్ పంప్‌హౌస్ పనులను పరిశీలించిన తర్వాత కుమ్మెర చేరుకుంటారు. వట్టెం రిజర్వాయర్‌కు సంబంధించిన ప్యాకేజీలు 8, 9, 10, 11 పనులను ముఖ్యమంత్రి పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించిన అధికారులు భద్రతా ప్రమాణాలు, వాహనాల పార్కింగ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలపై పలు సూచనలు చేశారు. సిఎం భద్రతా అధికారులతో కలిసి కలెక్టర్, ఎస్పీలు ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం వట్టెం రిజర్వాయర్ పంప్‌హౌస్ వద్ద జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రత, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా పోలీసు శాఖ తరపున పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సున్నిత ప్రాంతాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలను మోహరించనున్నట్లు పేర్కొన్నారు. వాహనాల తనిఖీలు, ప్రవేశ నియంత్రణ, ట్రాఫిక్ మళ్లింపులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి కూడా భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో యువ కవి బూర్గు గోపికృష్ణ




**ముద్ర, చిట్యాల :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తెలంగాణ భాష సంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనం లో కవి పఠనం చేసిన యువకవి, తెలంగాణ సాహితీ రాష్ట్ర కమిటీ సభ్యులు, బూర్గు. గోపికృష్ణ గారికి సన్మానం తో సర్టిఫికెట్ బహుమానమ్ ప్రదానం చేసిన ఈ కార్యక్రమం లో తెలంగాణ భాష సంస్కృతిక శాఖ డైరెక్టర్, ఐఏఎస్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అలాగే సలహా మండలి సభ్యులు పల్లె నర్సింహా స్నేహితులు ,సంస్కృతిక శాఖ సిబ్బంది, కవులు మేధావులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 04.06.2026
www.mudranews.in | @mudranews



**పిల్లల ఆరోగ్యానికి**

**చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యం**



ఉదయం బడి, సాయంత్రం ట్యూషన్లు మరియు హోంవర్క్‌ల ఒత్తిడిలోనే కాకుండా, బడి వేళలు ముగిశాక ఆటల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. ఆటలాడటం వల్ల పిల్లల్లో ఒత్తిడి తగ్గి, వారి మానసిక ఆరోగ్యం కూడా ఎంతగానో మెరుగ వుతుంది.

# కొమిరెడ్డి సేవలు మరువలేనివి..

- ఏడాదిలోపు రాములు, జ్యోతక్క - విగ్రహాలు ఏర్పాటు చేస్తాం.....
- కొమిరెడ్డి రాములు జయంతి వేడుకల్లో మంత్రి అడ్లూరి....





**ముద్ర, కోరుట్ల;** న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా కోరుట్ల, మెట్ పల్లి ప్రాంత ప్రజలకు కొమిరెడ్డి రాములు అందించిన సేవలు మరువలేనివని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు జయంతి వేడుకలు బుధవారం మెట్పల్లి లో నిర్వహించగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరాస్థాయిగా నిలిచిపోయే విధంగా కొమిరెడ్డి రాములు, జ్యోతక్క విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వం తరపున ఏర్పాటుకు సహకరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాములు కుటుంబ సభ్యులు సూచించిన చోట వచ్చే జయంతి లోపు విగ్రహాల ఏర్పాటు ప్రభుత్వ పరంగా చేస్తామని మంత్రి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తో పాటు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ నర్సింగరావు పర్యవేక్షణ లో విగ్రహ ఏర్పాట్ల పనులు చేయాలని మంత్రి సూచించారు. వచ్చే జయంతి లోపు విగ్రహాల ఏర్పాటు ప్రక్రియ పూర్తి కావాలని మంత్రి అడ్లూరి అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజమ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్యతో పాటు కోరుట్ల నియోజకవర్గం లోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## సేంద్రియ ఎరువులపై మొగ్గు చూపాలి

**ముద్ర, కరీంనగర్:** రైతులు అవశేషాలను కాల్చకుండా పొలంలోనే కలిపి సేంద్రియ పదార్థంగా మార్చుకోవాలని వాటిపై రైతులు మొగ్గు చూపాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్ రెడ్డి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చిగురుమామిడి మండలంలోని సుందరగిరి రైతు వేదికలో సర్పంచ్ జంగ శిరీష అధ్యక్షతన రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పంట అవశేషాలు దహనం (స్ట్రగుల్ బర్నింగ్) వల్ల నేలలోని ఉపయోగకర సూక్ష్మజీవులు నశించి నేల సారం తగ్గిపోవడంతోపాటు వాతావరణ కాలుష్యం పెరుగుతుందని అన్నారు. నేల పరీక్షల ఆధారంగా మాత్రమే పంటలను రైతులు వినియోగించాలన్నారు. యూరియా అధికంగా వాడటం వల్ల ఖర్చులు పెరగడంతోపాటు భూసారం దెబ్బ తింటుందని అన్నారు.

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి...

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ - కుమార్...
- ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం....



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి మార్కులు సాధించిన జగిత్యాల పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బొల్లి మనస్వి, రాయిళ్ల కృతిక, సింగారపు ప్రసన్నలు, పాఠశాల యాజమాన్యం, గాంధీనగర్ నాయకులతో ఎమ్మెల్యే ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు విద్యార్థులను అభినందించి, వారి భవిష్యత్ విద్యాభ్యాసంలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే పాఠశాలలో మౌలిక సదుపాయాల కొరత, ముఖ్యంగా అదనపు తరగతి గదులు మరియు మరుగుదొడ్ల సమస్యలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గారు పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు.

**బీరయ్య పట్నాల కు హాజరైన ఎమ్మెల్యే...**

జగిత్యాల రూరల్ మండలం తక్కలపల్లి గ్రామంలో జరుగుతున్న బీరయ్య పట్నాలు కు జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, ఏఎంసీ చైర్మన్, గ్రామ, పరిసర ప్రాంత ప్రజలు, పెద్దలు, నాయకులు, కురుమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి ప్రజా ప్రభుత్వం ద్వారా మాత్రమే సాధ్యం

**రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**






**ముద్ర, కోరుట్ల;** గ్రామాల అభివృద్ధి ప్రజా ప్రభుత్వం ద్వారా మాత్రమే సాధ్యం అవుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం కథలాపూర్ మండలం తండ్రియాల, దూలురు, గంభీర్పూర్, గ్రామంల్లో పలు కుల సంఘాలకు ప్రొసీడింగ్స్ లను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు. తండ్రియాల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం బొమ్మన గ్రామంలో పెద్దమ్మతల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుల సంఘాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు. విప్ వెంట మండలాధ్యక్షులు కాయితీ నాగరాజు మార్కెట్ చైర్మన్ పుండ్ర నారాయణ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు వెంట ఉన్నారు.

## బడిబాట చక్కగా నిర్వహించాలి

**ముద్ర, పెద్దపల్లి:** బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రతి పాఠశాలలో కనీసం 10 శాతం మేర విద్యార్థుల నమోదును పెంచాలని విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణి సూచించారు. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల విద్యాశాఖ పనితీరును సమీక్షించారు. ఈ విద్యా సంవత్సరంలో అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సదుపాయాలపై తల్లిదండ్రులు, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన కుమారి, డీఈవో శారద, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల అభివృద్ధి పనుల బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్...**






**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** గోదావరి పుష్కరాలు–2027 అభివృద్ధి పనుల అదనపు బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి.రాజ గౌడ్ లతో కలిసి గోదావరి పుష్కరాలు–2027 అభివృద్ధి పనుల అదనపు బడ్జెట్ ప్రతిపాదనల పై సంబంధిత ఆర్&బి, పి.ఆర్. ఇంజినీరింగ్, దేవాదాయ శాఖల అధికారులతో బుధవారం మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ద్వారా గోదావరి పుష్కరాలకు సంబంధించి చేపట్టాల్సిన పనులు, మంజూరైన నిధులు,అదనపు ప్రతిపాదనలు, టెండర్ల పురోగతిని మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల సందర్భంగా కోటిలింగాల, ధర్మపురి క్షేత్రాలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, వారి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్ల విస్తరణ, అవసరమైన వంతెనల నిర్మాణం, ట్రాఫిక్ నిర్వహణ చర్యలను ముందస్తుగా పూర్తి చేయాలని ఆదేశించారు ప్రభుత్వం నుంచి అవసరమైన సవరణలు, అనుమతులు తీసుకుని వెంటనే టెండర్లు పిలిచి ప్రాధాన్యత క్రమంలో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గోదావరి నది తీరంలో ఉన్న పుష్కర ఘాట్లను విస్తరించడంతో పాటు అవసరమైన చోట కొత్త ఘాట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. నీటిపారుదల శాఖ ద్వారా మంజూరైన నిధులతో పుష్కర ఘాట్ల అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టాలని తెలిపారు. ప్రతి పుష్కర ఘాట్ వద్ద వాటర్ షవర్స్, దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లు, తాగునీటి వసతులు, పారిశుద్ధ్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధర్మపురి ఆలయం సమీపంలో హెలీప్యాడ్, రహదారులు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుకు అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. కోటిలింగాల, ధర్మపురి దేవాలయాల అభివృద్ధికి మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు సులభంగా స్వామివారి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్.డి.ఓ. మధుసూదన్, దేవాదాయ శాఖ, మున్సిపల్, వివిధ ఇంజినీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ సమిష్టి బాధ్యత



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవ నేపథ్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, నేషనల్ గ్రీన్ కోర్ సంయుక్తంగా క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పంచశీల్ కళాశాలలో ప్లాస్టిక్ కాలుష్యంపై నిర్వహించిన ఈ పోటీలలో విజేతలకు ప్రశంస పత్రాలను అందజేశారు. సహాయ పర్యావరణ శాస్త్ర వేత్త డా. బి తిరుపతి, ఎన్జీసీ కోఆర్డినేటర్ మోహన్ రావు మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ కాలుష్యంపై అవగాహన, ప్రజల బాధ్యతను వివరించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య




**ముద్ర, కోరుట్ల;** కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో స్థానిక ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం రోజున బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామస్థులకు ప్రభుత్వ పాఠశాలల విశిష్ఠత గూర్చి వివరించారు. శిక్షణ పొందిన అనుభవజ్ఞులయిన ఉపాధ్యాయులు చక్కగా బోధిస్తారన్నారు. ఉచితంగా నోట్ బుక్కులు, యూనిఫారం, మధ్యాహ్న భోజనం పాఠశాలలో అందిస్తారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధోపాధ్యాయులు లోకిని శ్రీనివాస్, వసంత, గ్రామ సర్పంచ్ ముదాం రవీందర్, ఉప సర్పంచ్ చిట్యాురి మల్లయ్య, వనతడుపుల రవి కుమార్, శేఖర్ రావు, గాంధారి శ్రీనివాస్, ముంజ వెంకటేష్, వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

**వరి కొయ్యకళ్లకు నిప్పు పెడితే చర్యలు తప్పవు**



**ముద్ర, కోరుట్ల;** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం వెంకటాపుర్ గ్రామంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమం పంట పొలాల సంరక్షణ కార్యక్రమం బుధవారం రోజు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిని ఆర్. నాగమణి మాట్లాడుతూ రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడాలని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ముఖ్యంగా వరి కొయ్యకళ్లకు నిప్పు పెట్టకూడదని, అలాంటి చర్యల వల్ల నేల సారవంతం దెబ్బతినడంతో పాటు అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 27 ప్రకారం ఈ సూచనలను అతిక్రమించే రైతులపై గ్రామ పంచాయితీలు జరిమానాలు విధించేలా చర్యలు తీసుకుంటామని తెలపడం జరిగింది. అలాగే వానాకాలం లో రైతులు తప్పకుండా సన్నారకాలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ గంగారెడ్డి, ఏఈఓ ఫెమిన గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు టెక్నాలజీ వినియోగం

**పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు**




**ముద్ర, పెద్దపల్లి:** పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ప్రహరీ గోడను, శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు బుధవారం ప్రారంభించారు. పోలీస్ సిబ్బందికి సీపీతో కలిసి హెల్మెట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దొంగతనాలు, హత్యలు ఇతరత్రా సంఘటనల్లో వెంటనే నిందితులను పట్టుకోవడంలో పోలీసులు టెక్నాలజీని బాగా వినియోగించుకుంటున్నారని అభినందించారు. ప్రజా పాలనలో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా అవినీతికి తావు లేకుండా పోలీస్ అధికారులకు పోస్టింగులు ఇవ్వడం జరుగుతోందని స్పష్టం చేశారు. దీనివల్ల పోలీస్ స్టేషన్లలో అవినీతి అనేది లేకుండా పోయిందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏం జరిగిందో అందరికీ తెలిసిందే అని ఆయన అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో పోలీసు అధికారులు, సిబ్బంది నేరాల నియంత్రణకు నిర్విరామ కృషి చేస్తున్నారని చెప్పారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నాలుగు పోలీస్ స్టేషన్లకు కొత్త భవనాలు నిర్మించనున్నట్టు చెప్పారు. అలాగే ఏసీపీ కార్యాలయానికి కూడా నూతన భవనానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 04.06.2026
www.mudranews.in | @mudranews



### పిల్లల ఆరోగ్యానికి..



నాణ్యమైన ఆహారాన్ని అందించడం బద్దకమైన జీవన శైలితో పాటు పోషకాలు లేని ఆహారం తినడం వల్ల పిల్లల్లో ఊబకాయం వచ్చే ముప్పు పెరుగుతోంది. అందువల్ల వారి శారీరక ఎదుగుదలకు తోడ్పడేలా ఇంట్లోనే వండిన సమతుల్య, నాణ్యమైన ఆహారాన్ని అందించాలి.

## ధాన్యం కొనుగోలు, ధాన్యం ఆన్ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**: కలెక్టర్ అనురాగ్ జయంతి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ధాన్యం కొనుగోలు, ధాన్యం ఆన్ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం వలిగొండ మండలం నాగారంలోని వాసవి రైస్ మిల్లును జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంక రెడ్డి తో కలిసి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రైస్ మిల్లులో దాన్యం లోడు లారీలు ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. లోడ్ తో వచ్చిన లారీలను ఎప్పటికపుడు అన్లోడ్ చేయాలన్నారు. ప్రతి రోజు ధాన్యం లోడుతో ఎన్ని లారీలు మిల్లుకు వస్తున్నాయి అని అడిగి తెలుసుకున్నారు. ఒక్కో లారీ అన్లోడ్ చేయడానికి ఎంత సమయం పడుతుందని అడిగి తెలుసుకొని వచ్చిన వెంటనే హమాలీలతో అన్లోడ్ చేయించాలన్నారు. ధాన్యం అన్లోడ్ చేయడం కోసం మిల్లులో హమాలీలు సరిపడా ఉన్నారా లేదా అని ఆరా తీసి సరిపడ హమాలీలు లేకపోతే ఎక్కువ మందిని పెట్టుకొని ధాన్యం దిగుమతి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితి లోనూ మిల్లుల వద్ద ధాన్యం లోడ్ తో వచ్చిన వాహనాలు ఆగడానికి వీలు లేదన్నారు. ఏ రోజు వచ్చిన లారీ ఆరోజే అన్లోడ్ చేసి పంపించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంట వెంటనే లారీలను తిరిగి పంపించాలన్నారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి రోజా రాణి,,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ పై నిషేధం సమాజ హితం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** ప్లాస్టిక్ పై నిషేధం సమాజ హితమని ఉమ్మడి నల్గొండ జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ ఆఫీసర్ ఎం. వెంకన్న అన్నారు. బుధవారం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి డిగ్రీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తక్షణమే ప్లాస్టిక్ రహిత దేశంగా మార్చాలని ప్లాస్టిక్ ను వాడకుండా వదిలి వేయడమే దానికి చక్కటి పరిష్కారమని దానికి బదులుగా పర్యావరణహితమైనటువంటి పదార్థాలను ఉపయోగించి తయారు చేసే వస్తువులు వాడాలని తద్వారా పర్యావరణానికి ఇటు మానవ మనుగడకు మేలు చేసిన వారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ప్లాస్టిక్ రహిత దేశంగా మార్చాలని అన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి రమేష్, ఎన్ఎస్ఎస్ 1 2 3 ఆఫీసర్లు కనక బాలరాజు, తోటకూర రామకృష్ణ, ఎండి అత్తరు ఫరిన్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## దుర్గమ్మ పండుగలో పాల్గొన్న చైర్మన్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలోని రాయగిరిలో జరుగుతున్న దుర్గమ్మ పండుగలో మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కే చంద్రప్రకాష్ రెడ్డి పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పోలిశెట్టి అనిల్ కుమార్, ఫాల్ట్య వెంకటేష్, కోఆప్షన్ సభ్యులు పల్లెర్ల యాదగిరి వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## అమ్మవారి సన్నిధిలో ఎస్పీ అక్షాన్ష్ యాదవ్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలోని రాయిగిరి గ్రామంలో జరుగుతున్న శ్రీ దుర్గమ్మ పండుగ ఉత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దుర్గమ్మ తల్లి కరుణాకటాక్షాలు జిల్లా ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖశాంతులతో, ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, ఎస్ఐ అనిల్ కుమార్ ,స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పోలీసు అధికారులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆక్రమణలను తొలగించండి

**సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా ప్రభుత్వ భూములు అక్రమించిన వారిపై చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఆక్రమణలను తొల గించకపోతే పేదలచే ప్రభుత్వ భూములు అక్రమిస్తామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం హవేలీ సిపిఐ కార్యాలయంలో జరిగిన హవేలీ శాఖ సమావేశం నానబాల రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం సంపన్నుల పట్ల, కబ్జాదారుల పట్ల మెతక వైఖరిని అవలంభిస్తుందన్నారు. నిలువ నీడ లేక కాలువలపై గుడిసెలు వేసుకున్న వారిని బలవంతంగా ఖాళీ చేయించిందని ఈ ఖాళీ చేయడానికి ఎవరు కారకులో వారే ఇప్పుడు నాగార్జున సాగర్ కాలువ కట్టలను అక్రమిస్తున్నారని సురేష్ ఆరోపించారు. ప్రభుత్వం తమకు అండగా నిలబడుతుందని ఆక్రమణదారులు, కబ్జాదారులు విస్తృత ప్రచారం చేస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని సురేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లా యంత్రాంగం ఇదే రీతి అవలంభిస్తే పేదలను సమీకరించి ప్రభుత్వ భూములను అక్రమిస్తామని ఆయన స్పష్టం చేశారు. –సర్వే పరిశీలన :ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించి సిపిఐ ఫిర్యాదు మేరకు జరుగుతున్న ఆక్రమణలను సిపిఐ బృందం పరిశీలించింది. నీటిపారుదల –శాఖ, కార్పోరేషన్, రెవెన్యూ అధికారులు బుధవారం 12వ డివిజన్లో ఎన్నెస్పి కాలువ ఆక్రమణలకు సంబంధించి సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా సురేష్ అధికారులతో మాట్లాడుతూ నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని సురేష్ కోరారు. ఈ కార్యక్రమంలో హవేలీ ఏరియా సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ, సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ, నాయకులు ఉపేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం తో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో తుమ్మల మాట్లాడారు భారత వాతావరణ శాఖతో పాటు పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు.జిల్లాలోని జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న డెడ్ స్టోరేజ్ నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, పచ్చి రొట్టె విత్తనాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే పంటలను రైతులు సాగు చేయాలని సూచించిన మంత్రి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసినట్లు తెలిపారు.రైతులు సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల కొనుగోళ్లను కూడా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని, మార్కెటింగ్ పరంగా పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. దేశం లోని అనేక రాష్ట్రాలు మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, సోయాబీన్ వంటి పంటలను కొనుగోలు చేయకపోయినా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్‌తో పాటు 65 లక్షల టన్నుల వరిని కొనుగోలు చేసిందన్నారు.రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని తుమ్మల పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం జరగడానికి డీజిల్ కొరత, బంగ్లాదేశ్ పరిస్థితుల కారణంగా గన్నీ బ్యాగుల సరఫరాలో అంతరాయం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, లోడింగ్–అన్‌లోడింగ్ సమస్యలు వంటి పలు కారణాలు ఉన్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం గిడ్డంగుల సామర్థ్యాలను పెంచకపోవడం, పాత నిల్వల సమస్యలు కూడా ప్రభావం చూపాయని తెలిపారు. అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను కాపాడటంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైందన్నారు. ఉద్యాన పంటలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. దేశం ఇప్పటికీ వంటనూనెలు, పప్పుధాన్యాలు, కూరగాయల కోసం విదేశాలపై ఆధార పడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కల్లూరు ఫ్యాక్టరీ ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగును విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. దేశంలో పత్తి సాగు పెద్దఎత్తున జరుగుతున్నప్పటికీ విదేశాల నుంచి పత్తి దిగుమతులు చేయడం రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు. అలాగే ఆయిల్ పామ్ దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించడం వల్ల దేశీయ రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. దిగుమతి సుంకాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినప్పటికీ స్పందన లేదన్నారు.పురుగుమందుల అధిక వినియోగం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో భారత వ్యవసాయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తుల ద్వారా మాత్రమే ప్రపంచ మార్కెట్లలో పోటీ పడగలమన్నారు. రైతులు పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయ పద్ధతులు, నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు.రామగుండం ఎరువుల కర్మాగారం తరచూ ఉత్పత్తి నిలిపివేయడం, కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.ఖమ్మం జిల్లా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తెలిపారు. ఇందుకు జిల్లా కలెక్టర్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు.జిల్లాలో అనేకసార్లు అవగాహన కల్పించినప్పటికీ కొంతమంది రైతులు వరి కొయ్యలు, పంట అవశేషాలను కాల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పక్కనే ఉన్న పంటలు, తోటలకు నష్టం వాటిల్లడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ప్రాణనష్టం కూడా సంభవించిందన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోతుందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.ఈ మీడియా సమావేశంలో కలెక్టర్ దివాకర, సిపి సునీల్ దత్, ఎమ్మెల్యేలు రామదాస్ నాయక్, రాగమయి , అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద లబ్ధిదారుల ఆందోళన

**సామూహిక గృహప్రవేశం చేస్తామని హెచ్చరిక**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. బుధవారం డబుల్ బెడ్ రూమ్ల వద్ద సమావేశం ఏర్పాటు చేసుకొని ఎవరికి సంబంధించిన ఫ్లాట్లను వాళ్లు శుభ్రం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 ఆగస్టులో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పట్టాలు ఇవ్వడం జరిగిందని కానీ 2,3 నెలల కాల వ్యవధిలోనే ప్రభుత్వం మారడంతో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేయడంతో లబ్ధిదారుల మందిరం కలిసి గతంలో ఎమ్మార్వో, కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆ క్రమంలో భువనగిరి ప్రస్తుత శాసనసభ్యులు తక్షణమే పనులు చేపిచ్చి మీకు ఇస్తానని 2.5 కోట్ల రూపాయలతో మౌలిక వసతులు కల్పిస్తానని మాట ఇచ్చి సంవత్సరం కాలం కావొస్తుంది కానీ పనులు ఇంతవరకు పూర్తి కాలేదన్నారు. గత నెలలో అధికారులు జూన్ 2న మీ అందరి చేత గృహప్రవేశాలు చేయిస్తామని మాట ఇవ్వడం జరిగిందని పనులు ఇప్పటివరకు పూర్తికాకపోవడంతో లబ్ధిదారులమందరము గృహప్రవేశం చేస్తామని నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. లబ్ధిదారులకు బిఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖ మద్దతు పలికింది. విషయం తెలుసుకున్న భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి హుటాహుటిన అక్కడికి చేరుకొని లబ్ధిదారులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులతో మాట్లాడి గతంలో ఇచ్చిన మాట ప్రకారం పనులు పూర్తికాలేదు కానీ ఈ ఒక్కసారి అవకాశం ఇవ్వండి కలెక్టర్ తో మాట్లాడి ఉదయం 11 గంటలకు పనులను పూర్తిచేసే తేదీని ప్రకటిస్తానని హామీ ఇవ్వడంతో లబ్దిదారులు, బిఆర్ఎస్ నాయకులు వెను తిరిగారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏ వి కిరణ్ కుమార్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు నాకోటి నగేష్, చీమల రాజు నాయకులు మహేష్, కాజా అజీముద్దీన్, శివ, తాడూరు బిక్షపతి, జాంగిర్, ఇక్బాల్ చౌదరి, నరసింహ, కాజం, పవన్, సుభాష్, వేముల కృష్ణ, సూరజ్, అంజాద్, పవన్,చిన్న పాల్గొన్నారు.

## యూరియా యాప్ రద్దు చేయండి





**-రైతు సంఘం సమావేశంలో బాగం**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** యాప్ ద్వారా యూరియా పంచే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. రైతులు యాప్ ద్వారా యూరియా పొందెందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం గిరిప్రసాద్ భవన్ లో జరిగింది. మిడికంటి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్ను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అధికారుల అంచనాల మేరకు రసాయనిక ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు గతేడాది తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఈ ఏడాది ఆ పరిస్థితి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం రసాయనిక ఎరువుల కోటాను తగ్గించిన క్రమంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలని సూచించారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించకపోతే రైతులకు ఆర్థికంగా భారమవుతుందని ఇప్పటికే రైతులు పెట్టుబడులు పెరిగి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతు భరోసా విషయంలో దాటవేత ధోరణిని అవలంభిస్తుందని యాసంగి సీజన్ కు సంబంధించి రెండు ఎకరాలకు పైగా ఉన్న రైతులకు తక్షణం రైతు భరోసా డబ్బులు జమ చేయాలని వానా కాలానికి సంబంధించి రైతు భరోసా సైతం జమ చేయాలన్నారు. ములకశిర కార్తె సమీపిస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న మొక్కజొన్నలు, ధాన్యా న్ని కాంటాలు వేసి తరలించాలని నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలోనూ ఈ ప్రభుత్వం చెప్పిన మాటను నిలబెట్టుకోలేక పోయిందన్నారు. వరుస విపత్తులు సంభవిస్తున్న నేపథ్యంలో పంటల బీమా పథకాన్ని ఈ సీజన్ నుంచే అమలు చేయాలని, నకిలీ విత్తనాలు, పురుగు మందులను అరికట్టాలన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 8న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రైతాంగ సమస్యల – పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉద్యమిస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు – దొండపాటి రమేష్, జిల్లా నాయకులు పావులూరి మల్లికార్జున్, బాగం ప్రసాద్, పుచ్చకాయల సుధాకర్, మామిడి సుదర్శన్రెడ్డి, భాస్కర్, రాంకోటి, దొబ్బల కృష్ణ, రామకృష్ణ, వెంకటనర్సయ్య, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, తోటపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## ఇక బీసీ రాజ్యాధికారమే..



**జూలై 5వ భువనగిరి సభతో ఆ పార్టీలు గల్లంతు**
**లక్షమందితో భువనగిరిలో భారీ బహిరంగ సభకు టీఆర్పీ సిద్ధం**
**సభకు రాజ్యాధికార సమరభేరిగా నామకరణం**
**పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన టీఆర్పీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్**
**పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జూలై 5న భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సమావేశం భువనగిరి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్ లో నిర్వహించారు. భువనగిరి బహిరంగ సభ కోసం ఏర్పాటు చేసిన 13 కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించగా ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హాజరై పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ మాట్లాడుతూ సభకు రాజ్యాధికార సమరభేరి గా పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నామకరణం చేసినట్లు ప్రకటించారు. సభ నిర్వహించే స్థలం అయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ కి బెల్లి లలిత సభా ప్రాంగణంగా నామకరణం చేసినట్లు తెలియజేశారు. భువనగిరి సభ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో సమూలమైన మార్పులు జరుగుతాయని అగ్రవర్ణ పార్టీల మనుగడ ప్రశ్నార్ధకంగా మారుతుందని అన్నారు. భువనగిరి జిల్లాకు సంబంధించి పలువురికి పదవులు ఇస్తూ నియామక పత్రాలు భువనగిరి జిల్లా అధ్యక్షులు కొమిరిశెట్టి నర్సింహులు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ చేతుల మీదుగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గంగాధర్ లింగాల,వేములవాడ మదన్ మోహన్ చారి,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ,ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్,క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ బంధారపు నర్సయ్య,కోశాధికారి కొక్కలకొండ మనోజ్,మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నీరజ గౌడ్,రాష్ట్ర కార్యదర్శులు ఆర్.భవన్ వెంకటేష్,నగేష్ ముదిరాజ్,రమేష్ యాదవ్,కొమ్ముల ప్రవీణ్ రాజ్,ఆకుల హనుమాన్లు,శివవీర్ రెడ్డి, పసల ప్రసన్న,అఖిల్ పాషా,రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మనోజ్ ఆకుల,యూత్ అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్ర శేఖర్,కార్మిక విభాగం అధ్యక్షుడు సంకూరి శ్రీనివాస్,విద్యార్థి విభాగం అధ్యక్షుడు ML రాజు,మైనారిటీ విభాగం అధ్యక్షులు సల్మాన్,ఆఫీస్ కో ఆర్డినేటర్ లింగం యాదవ్,రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్,సుతారపు రంగన్న పాల్గొన్నారు

### పిల్లల ఆరోగ్యానికి విషయగ్రహణ సామర్థ్యాన్ని పెంచడం



ఆటాపాటల వల్ల శరీరంలో కొవ్వు తగ్గి, కీలక అవయవాల చుట్టూ వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) రాకుండా ఉంటుంది. ఫలితంగా పిల్లల్లో విషయగ్రహణ సామర్థ్యం పెరిగి, వారు చదువుల్లో మరియు పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తారు.

## క్యాన్సర్‌పై మనోధైర్యమే గొప్ప ఆయుధం

**డాక్టర్ రామకృష్ణ ప్రసాద్**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** క్యాన్సర్ వ్యాధికి మనోధైర్యాన్ని మించిన వైద్యం మరొకటి లేదని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి ఆంకాలజీ నిపుణుడు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యశోద ఆసుపత్రిలో రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో 'హైపర్‌సైట్' సాంకేతికత ద్వారా క్యాన్సర్ చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ కణాలు ఉన్న ప్రాంతానికే రేడియేషన్ అందించడంతో మిగతా శరీర భాగాలపై దుష్ప్రభావాలు చాలా తక్కువగా ఉంటాయని వివరించారు. ఈ హైపర్‌సైట్ మిషన్ ఇండియాలో ఎక్కడ లేదని, ఒక్క సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో మాత్రమే కలదన్నారు. ఈ ఆధునిక వైద్య సదుపాయాన్ని సిద్దిపేటతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నామని, వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇప్పటికే అనేక మంది క్యాన్సర్ రోగులకు విజయవంతంగా చికిత్స అందించి కోలుకునేలా చేశామని తెలిపారు. ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి ప్రతినిధి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ లో అటవీ అధికారులు, సిబ్బంది ర్యాలీ



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లా కేంద్రం మెదక్ లో జిల్లా అటవీ శాఖ కార్యాలయం నుండి భారీ సైకిల్ ర్యాలీని జిల్లా అటవీశాఖాధికారి జోజి పచ్చ జెండా ఊపి పారంభించారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలనే సంకల్పంతో అటవీ శాఖ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వచ్ఛందంగా ప్రజలు పాల్గొన్నారు ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడటం ప్రతి పౌరుని ప్రాథమిక కర్తవ్యం అంటూ అటవీ అధికారులు నినాదాలు చేశారు. పచ్చదనాన్ని పెంచడం, కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించగలమని డిఎఫ్ఓ జోజి పేర్కొన్నారు. ఈ ర్యాలీలో మెదక్, పెద్ద శంకరంపేట్, తూప్రాన్ రేంజ్ అధికారులు గణేష్, కుత్బుద్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.

## గోపీనాథ్ ముండేకు భారతరత్న ప్రకటించాలి

**- వంజరి సంఘాల డిమాండ్**



**ముద్ర, హైదరాబాద్ :** దేశంలోని బడుగు, బలహీన వర్గాల రాజకీయ సాధికారత కోసం విశేషంగా కృషి చేసిన దివంగత నేత గోపీనాథ్ ముండేకు భారతరత్న పురస్కారం ప్రకటించాలని అఖిల భారత వంజరి సేవా సంఘం, తెలంగాణ వంజరి సేవా సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. గోపీనాథ్ ముండే 13వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన నివాళి కార్యక్రమంలో సంఘ నాయకులు ఈ డిమాండ్ చేశారు. వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో ముండే కీలక పాత్ర పోషించారని, ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని కోరారు. తెలంగాణకు గోపీనాథ్ ముండే వంటి ప్రజానాయకుల అవసరం ఎంతో ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వంజరి సేవా సంఘం నాయకులు సాల్వేరు కృష్ణ, ఎదుగని శంకర్, ఎదుగని హరినాథ్, కాలేరు సురేష్, ధాత్రిక కాశీనాథ్, కాలేరు యుగంధర్, రిటైర్డ్ డీఎస్పీ శివప్రసాద్, రత్నం సంతోష్ ఆముద లక్ష్మణ్, మహదేవ్ ముండే, కాలేరు సాయిబాబా, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో రెస్టారెంట్‌లో ఘోర అగ్నిప్రమాదం



**ముద్ర డెస్క్ :** దేశ రాజధాని ఢిల్లీలోని మాలవీయ నగర్ ప్రాంతంలో ఉన్న ఓ రెస్టారెంట్‌లో బుధవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 21 మంది సజీవ దహనమవగా, 40 మంది వరకు గాయపడ్డారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి 37 మందిని సురక్షితంగా రక్షించారు. మృతుల్లో ఎక్కువ మంది విదేశీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

## ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్

**విద్యాశాఖ ఉత్తర్వులు జారీ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలోని ఇన్–సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాధారణంగా ప్రతి ఏటా నిర్వహించే రెండు టెట్ పరీక్షలకు అదనంగా.. మరో రెండు ప్రత్యేక టెట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. పూర్తిగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసమే ప్రత్యేక టెట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.గత కొంతకాలంగా ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం.. ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రత్యేక టెట్ నిర్వహణకు సంబంధించి అధికారిక ఉత్తర్వులను కూడా జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో.. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి తదుపరి అవసరమైన అన్ని చర్యలనూ తక్షణమే చేపట్టాలని విద్యాశాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# శాస్త్రీయంగా, హేతుబద్ధంగా భూముల మార్కెట్ విలువల సవరణ

**క్షేత్రస్థాయి అధ్యయనం ఆధారంగా కొత్త విలువల నిర్ణయం**
**ఈ నెల 5వ తేదీ నుంచి అమలు**
**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5 నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల మేరకు కొత్త విలువలు ఉన్నాయన్నారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రాంతాలవారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు పరిశీలించామన్నారు. ''భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశాం. 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై సమీక్ష జరిపాం. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి. అభివృద్ధి, భూముల డిమాండ్, మార్కెట్ పరిస్థితులు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం. ఫ్లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉంటుంది. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట పెంపు ప్రతిపాదనలు లేవు. హెచ్ఎండీఏ, క్యూర్, ఇతర ప్రాంతాలకు ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస రేట్లు ఖరారు చేశాం. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించడంతో కొత్త ధరల అవసరం ఏర్పడింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతో సవరణలు చేపట్టాం''అని మంత్రి తెలిపారు.

## ఏడుపాయలలో హరీష్ రావు జన్మదిన వేడుకలు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయం వద్ద నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కంటారెడ్డి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఏడుపాయల వనదుర్గా మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజగోపురం వద్ద కేక్ కట్ చేసి హరీష్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంటారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కన్నీరు ఎక్కడ ఉంటే తన్నీరు అక్కడ ఉండి ప్రజల కన్నీరు తుడుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోములు, బాలాగౌడ్, గురుమూర్తి గౌడ్, శ్రీనాథ్, లింగా రెడ్డి, సర్పంచులు సురేష్, గంట రాణి సుధీర్, నాయకులు సంగ పవిత్ర దుర్గయ్య, కాశీనాథ్ రావు, శ్రీనివాస్, కొండల్ రెడ్డి, చంద్రమోహన్ గౌడ్, జగదీష్ చారి, కిరణ్ గౌడ్, నవీన్, సాయి, దినేష్ గౌడ్ పాల్గొన్నారు.

## దుకాణాల్లో చోరీ

దుకాణాల తాళాలు పగులగొట్టి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున తూప్రాన్‌లో చోటుచేసుకుంది. పట్టణంలోని సాయిరాం, సాయిబాబా ఎరువుల దుకాణాల నిర్వాహకులు సోమవారం రాత్రి ఎప్పటిలాగే తాళాలు వేసి వెళ్లారు. మంగళవారం ఉదయం సాయిరాం దుకాణ యజమాని బొల్లు రమేష్ తాళాలు తెరిచి చూడగా సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. నగదు డ్రాలో పరిశీలించగా రూ.51 వేలు కనిపించలేదు. పక్కనే ఉన్న సాయిబాబా ఎరువుల దుకాణంలో సైతం చోరీకి యత్నించాడు.బాధితులు తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## తెలంగాణ ఆర్టీసీలో ఫుడ్ సేఫ్టీపై ఓరియంటేషన్




**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని తెలంగాణ గురుకుల మైనారిటీ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ వార్డెన్లు, కిచెన్ సిబ్బందికి ఫుడ్ సేఫ్టీ అంశంపై ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం మెదక్ గర్ల్స్–1 కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వదీప్ కుమార్, ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ డాక్టర్ రాజ్‌కుమార్ హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు, ప్రొజెక్టర్ ద్వారా ఆహార భద్రతకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆహారం వండేటప్పుడు పాటించాల్సిన పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార పదార్థాలు మరియు బియ్యం నిల్వ చేసే విధానం, ఆహార నాణ్యతను కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫుడ్ సేఫ్టీ నిబంధనలపై చిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థులకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడంలో డిప్యూటీ వార్డెన్లు, కిచెన్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎల్ సి డి. బహుమతి, విజిలెన్స్ అధికారులు గౌస్ పాషా, జగదీశ్వర్ రెడ్డి మెదక్ గర్ల్స్–1 ప్రిన్సిపాల్ ఆర్. సురేఖ తదితరులు పాల్గొన్నారు.



## మెదక్‌లో మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు



**మెగా రక్తదానం**

**ముద్ర ప్రతినిధి, మెదక్:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు జన్మదినం సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్, యం.పద్మ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి బాలాజీ గార్డెన్ లో కేక్ కట్ చేశారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, న్యాయవాది జీవన్ రావు, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, యం. లావణ్య రెడ్డి, బట్టి. జగపతి, కృష్ణారెడ్డి, గంగా నరేందర్, దీపక్ కుమార్, మాయ మల్లేశం,ఆర్.కే. శ్రీనివాస్, చంద్రకళ, కృష్ణ గౌడ్, లింగారెడ్డి, సోములు, బాలా గౌడ్,మెదక్, మంజ గౌడ్, సీహెచ్. శ్రీనివాస్ రెడ్డి,కార్యకర్తలు పాల్గొన్నారు.

**నతానియల్ పార్థివదేహానికి నివాళులు**



మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి నతానియల్ గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి మెదక్ పట్టణంలోని దాయర వీధిలోని నివాసానికి చేరుకుని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యుత్తు ఉద్యోగి..

**ముద్ర డెస్క్ :** ద్విచక్ర వాహనాన్ని వ్యాన్ ఢీకొని విద్యుత్తు ఉద్యోగి మృతి చెందిన సంఘటన తూప్రాన్ మండలం ఇమాంపూర్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై గంగరాజు తెలిపిన వివరాలు.. మనోహరాబాద్‌కు చెందిన చిత్తారి భిక్షపతి(50) తూప్రాన్ విద్యుత్తు కార్యాలయంలో ఆర్టిజన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన వ్యాన్ బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భిక్షపతిని 108 వాహనంలో తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

## నైజీరియా యువతకు తెలంగాణ విత్తన రంగ శిక్షణ



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ విత్తన రంగంలో ఉన్న అనుభవం నైజీరియాలోని టరాబా రాష్ట్ర యువతకు ఉపయోగపడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శామీర్‌పేట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (IPE) లో నిర్వహించిన అంతర్జాతీయ విత్తన విద్య, పారిశ్రామిక అభివృద్ధి శిక్షణ కార్యక్రమం ముగింపు వేడుకలో మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన టరాబా రాష్ట్ర యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. విత్తన ఉత్పత్తి, హైబ్రిడ్ సీడ్ టెక్నాలజీ, విత్తన శుద్ధి, ప్రాసెసింగ్, వ్యవసాయ వ్యాపార నిర్వహణ వంటి అంశాల్లో యువత ప్రాయోగిక పరిజ్ఞానం పొందారని తుమ్మల తెలిపారు. వ్యవసాయం, విత్తన సాంకేతికత, రైతు శిక్షణ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ–టరాబా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, నైజీరియాలోని టరాబా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అగ్బు కెఫాస్, టరాబా సీడ్స్ లిమిటెడ్, ప్రసాద్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ ప్రతినిధులు, శిక్షకులు, అధికారులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసిన యువతకు సర్టిఫికెట్లు అందజేశారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com